క్లుప్తంగా

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

లబ్బీపేట(విజయవాడతూర్పు): రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని ఎన్టీఆర్ జిల్లాలోని రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు పోలీసులు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు ఆదేశాల మేరకు అన్ని పోలీస్‌స్టేషన్లు, టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. గంజాయి, మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణాలకు దూరంగా ఉండాలని, చెడు వ్యసనాలను మాని సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ప్రతి ఒక్కరిపై పోలీస్ నిఘా ఉంటుందని, ఎవరైనా గొడవలు, ఇతర నేరాల్లో పాల్గొంటే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్ అధికారులు హెచ్చరించారు.

బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): స్థానిక సింగ్‌నగర్‌లోని మాకినేని బసవ పున్నయ్య స్టేడియంలో బ్యాడ్మింటన్ జోనల్ జోనల్ స్థాయి పోటీలు ఆదివారం జరిగాయి. ఈ పోటీల్లో సింగిల్స్, డబుల్స్ అండ్ మిక్స్‌డ్ డబుల్స్‌లో షేక్ అమీనా విజేతగా నిలిచింది. పోటీల్లో ప్రతిభ చూపిన షేక్ అమీనాకు అతిథులు మెడల్స్‌ను అందజేశారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కూటమి ప్రభుత్వ ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో కుల గణన చేపట్టి బీసీ జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లాకా వెంగళరావు యాదవ్ డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడ ప్రెస్ క్లబ్‌లో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు రక్షణ చట్టం కల్పించాలన్నారు. కేంద్ర స్థాయిలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, మహిళా బిల్లులో బీసీ మహిళకు ప్రత్యేక స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల నరసరావు, ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి, నాయకులు యలమందరావు, బీఎస్సార్ యాదవ్, పద్మావతి, నగేష్ , నాగమల్లేశ్వరరావు, గీత, నాగుల్ మీరా పాల్గొన్నారు.

మధురంగా త్యాగరాజ స్వామి కృతులు

విజయవాడకల్చరల్: జేఎంఎస్ నాట్యవేద అకాడమీ ఆఫ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ ఆధ్వర్యంలో మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ అకాడమీలో ఆదివారం నిర్వహించిన సంగీత, నాట్య సమ్మేళనం సమ్మోహనంగా సాగింది. జంగం శ్రీనివాస చక్రవర్తి, విజయకుమార్ ఆధ్వర్యంలో మూడు గంటల పాటు జరిగిన స్వర, లయ, నాట్యవిన్యాసం ఆకట్టుకుంది. సంప్రదాయ సంగీత కార్యక్రమంలో భాగంగా నాట్యవేద విద్యార్థులు అన్నమయ్య, రామదాసు, త్యాగరాజ స్వామి కృతులను మధురంగా ఆలపించారు. గురు శిష్య మృదంగ సంవాద కార్యక్రమంలో మృదంగ విద్వాంసుడు అమ్ముల ప్రసాద్ జగం శిరీషా చక్రవర్తి నిర్వహించిన లయ విన్యాసం కార్యక్రమం ఆకట్టుకుంది. నాట్య అకాడమీ విద్యార్థులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. సంగీత విద్వాంసులు అన్నవరపు రామస్వామి, వేదపండితులు డాక్టర్ వేదాంతం రాజగోపాల చక్రవర్తి, వయోలిన్ విద్వాంసుడు పాణ్యం దక్షిణామూర్తిని పాల్గొని కళాకారులకు బహుమతులను అందజేశారు.

బ్రాహ్మణులు రాజకీయంగా అభివృద్ధి సాధించాలి



విజయవాడకల్చరల్: బ్రాహ్మణులు రాజకీయంగా ఎదిగి సమాజసేవ చేస్తూ ప్రగతి సాధించాలని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణమూర్తి పేర్కొన్నారు. రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని హనుమాన్ పేటలోని రాజరాజేశ్వరి కల్యాణమండపంలో ఆదివారం నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన బలరామకృష్ణమూర్తి మాట్లాడుతూ బ్రాహ్మణులు సమాజసేవలో భాగస్వాములు కావాలన్నారు. గన్నవరం విమానాశ్రయానికి పింగళి వెంకయ్య పేరుపెట్టాలని సభ్యులు తీర్మానం చేశారు. ప్రతి నియోజకవర్గంలో కర్మల భవన్ ఏర్పాటు చేయాలి, నిరంతరం బ్రాహ్మణ సంక్షేమానికి కృషి చేస్తున్న బ్రాహ్మణ సంక్షేమ గౌరవాధ్యక్షులుగా పనిచేస్తున్న బలరామకృష్ణమూర్తిని శంకర మఠం రాజరాజేశ్వరి కళాపీఠం ట్రస్ట్‌కు అధ్యక్షుడిగా నియమించాలని సభ్యులు డిమాండ్ చేశారు. పూర్వపు అధ్యక్షుడు ముత్తనపల్లి శివకృష్ణ ప్రసాద్, గాలి శ్రీనివాసరావు రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు, వేదం శ్రీహరి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కోశాధికారి ఉమామహేశ్వరరావు, మీడియా కో-ఆర్డినేటర్‌తోపాటు వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన సభ్యులు పాల్గొన్నారు.

భయం గుప్పిట్లో కొండ ప్రాంతవాసులు

- జారిపడుతున్న కొండచరియలు
- వర్షాలతో భయాందోళన వ్యక్తం చేస్తున్న కొండ ప్రాంత నివాసితులు
- పటిష్టమైన చర్యలు చేపట్టాలంటున్న ప్రజానీకం



శనివారం కొండచరియలు పడిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ సత్యబాబు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గంలో కొండ ప్రాంతవాసులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఎక్కడ కొండచరియలు జారి పడతాయోనని భయంతో జీవిస్తున్నారు. 15 మాసాలుగా కూటమి ప్రభుత్వం కొండ ప్రాంత ప్రజల పరిరక్షణకు ఎటువంటి చర్యలు చేపట్టకపోవటంతో కొండ చరియల భద్రతపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. గత ప్రభుత్వంలో పలు ప్రాంతాల్లో రిటైనింగ్ వాల్స్‌ను నూతనంగా నిర్మాణం చేసి ప్రజలకు భరోసా కల్పించారు. అయితే పెరుగుతున్న నివాసాలతో భూమిలోకి నీరు ఇంకుతున్న నేపథ్యంలో కొండచరియలు ప్రమాదభరితంగా మారుతున్నాయని అధికారులు చెబుతున్నారు. దీంతో ఎప్పటికప్పుడు వాటి పరిరక్షణకు చర్యలు తప్పవంటూ స్థానిక ప్రజానీకం వాపోతున్నారు.

ప్రతి ఏటా వర్షాకాలంలో ఆందోళన

ప్రతి ఏటా వర్షాకాలంలో కొండ ప్రాంతనివాసితులు ఆందోళనతోనే జీవనాన్ని కొనసాగిస్తుంటారు. గొల్లపాలెంగట్టు ప్రాంతంలో శనివారం కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఏడాది మేలో కొత్తపేట 51వ డివిజన్ కొండ ప్రాంతంలో కొండచరియలు జారిపడి స్థానిక కుటుంబానికి తీవ్ర నష్టాన్ని కలగజేసింది. అలాగే ఇటీవల 46వ డివిజన్ రామరాజ్యనగర్‌లోని కొండ ప్రాంతంలో కొండచరియలు విరిగిపడటంతో స్థానికంగా నివాసముండే బాబూరావు ఇంటిపై పడి నివాసం దెబ్బతిన్నది. ఈ ఇంటికి సమీపంలో ఉన్న పలు వస్తువులు సైతం ధ్వంసమయ్యాయి. కొండ చరియలు జారి పడటం వలన ఆ ప్రాంతంలోని నివాసితులు తీవ్రంగా నష్టపోయారు. గొల్లపాలెంగట్టు ప్రాంతంలోని కొండ చరియలు ఇటీవల జారిపడి స్థానికంగా నివాసితులను తీవ్రంగా నష్టపరిచాయి. అదేవిధంగా కుమ్మరిపాలెం సెంటర్ సమీపంలోనూ ఇంటి వెనుక భాగంపై కొండ చరియలు జారిపడి స్థానికంగా నివాసముంటున్న మహిళ తీవ్ర గాయాలపాలైంది. ఈ విధమైన సంఘటనలు కొనసాగుతూనే ఉంటున్నాయి.

ప్రమాదభరితంగా కొండచరియలు

పశ్చిమ నియోజకవర్గంలో సగానికి పైగా డివిజన్లు కొండ ప్రాంతల్లోనూ ఉంటాయి. లక్షకుపైగా ప్రజలు కొండ ప్రాంతాల్లోనూ నివాసం ఉంటున్నారు. వారంతా కొండ ప్రాంతాల పటిష్టకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ప్రధానంగా ఏడాది కాలంలో ఎక్కడా ఎటువంటి రిటైనింగ్ వాల్ నిర్మాణాలు చేపట్టలేదని స్థానికులు చెబుతున్నారు. కనీసం ప్రమాదభరితంగా ఉన్న ప్రాంతాల్లో కొండచరియలు జారిపడకుండా పటిష్టమైన చర్యలు చేపట్టడానికి అధికారులు స్పందించాలని స్థానిక నివాసితులు విజ్ఞప్తి చేస్తున్నారు.



కొండచరియలతో విరిగిపడిన ప్రహరీ

నిధులు విడుదల చేయాలి..



కొండ ప్రాంతాల్లో ఆమోదం పొందిన రిటైనింగ్ వాల్స్ నిర్మాణానికి కూటమి ప్రభుత్వం నిధులు విడుదల చేయటం లేదు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో కొండ చరియలు ప్రమాదభరితంగా దర్శనమిస్తున్నాయి. కొండ ప్రాంతాల్లో చాలా ప్రాంతాల్లో రిటైనింగ్ వాల్స్ నిర్మాణం చేపట్టాలి. భారీ వర్షం పడినా ప్రతి సారి ఎక్కడో ఒక చోట ప్రమాదం చోటుచేసుకుంటుంది. దీనిపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి నివారణ చర్యలు చేపట్టాలి.

– బోయి సత్యబాబు, సీపీఎం ఫ్లోర్‌లీడర్

ప్రజాకాపునాడు 51వ డివిజన్ కమిటీ నియామకం



నూతన కమిటీని అభినందిస్తున్న అంజిబాబు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రజా కాపునాడు సంక్షేమ సంఘం 51వ డివిజన్ అధ్యక్షుడిగా సకినాల వెంకటరాజేంద్రప్రసాద్‌ను నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యర్రంశెట్టి అంజిబాబు చెప్పారు. ఈ సందర్భంగా కొత్తపేటలోని సంఘ కార్యాలయంలో ఆయన నూతన కమిటీకి నియామక పత్రాలను ఆదివారం అదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ నగరంలో 64 డివిజన్లలో కమిటీలను నియమిస్తున్నామన్నారు. అందులో భాగంగా 51వ డివిజన్ కమిటీని నియమించినట్లు చెప్పారు. 51వ అధ్యక్షుడిగా సకినాల వెంకట రాజేంద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా రాజనాల రమేష్‌బాబు ఉపాధ్యక్షుడు నారండి సాంబశివరావు, సహాయ కార్యదర్శులుగా సుంకర భరత్‌ప్రకాష్, జమ్మూ అంజిబాబులను నియమించామన్నారు. కాపుల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. పేద కాపు మహిళలకు పెళ్లి కానుక పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గణపా రాము, పశ్చిమ కార్యదర్శి కర్రి గౌరి తదితరులు పాల్గొన్నారు.

కస్టమర్‌పై చాకుతో దాడి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఉప్మా అట్టుకు డబ్బులు తీసుకుని సాదా అట్టు ఇచ్చారేంటని అడిగిన కస్టమర్‌పై చాకుతో దాడికి పాల్పడిన ఘటన కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జక్కంపూడి కాలనీ బ్లాక్ నెం 7లో అబ్దుల్ కరిముల్లా కుటుంబం నివాసం ఉంటుంది. కరిముల్లా ట్రాన్స్‌పోర్టు కార్యాలయంలో పని చేస్తుంటాడు. శనివారం రాత్రి డ్యూటీ ముగించుకుని ఇంటికి వెళ్లుతూ వైవి.రావు ఇన్నర్ రింగ్ వద్ద ఉన్న వెల్‌కం హోటల్‌లో ఉప్మా అట్టు కొనుగోలు చేశారు. పార్సిల్‌ను ఇంటికి తీసుకువెళ్లిన తర్వాత సాదా అట్టు కనిపించడంతో తిరిగి హోటల్ వద్దకు వచ్చి కౌంటర్‌లో సిబ్బందిని ప్రశ్నించాడు. దీంతో కౌంటర్‌లో ఉన్న రామకృష్ణ అనే యువకుడు నోటికి ఇష్టం వచ్చినట్లు మాట్లాడమే కాకుండా కరిముల్లా కాలర్ పట్టుకుని మరో చేతికి అందిన చాకుతో మెడపై కోశాడు. దీంతో కరిముల్లాకు గాయం కావడంతో చుట్టు పక్కల వారు వెంటనే ఆటోలో ఆసుపత్రికి తరలించారు. ఘటనపై బాధితుడు కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

22 నుంచి దసరా మహోత్సవాలు



దసర ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న రామిరెడ్డి తదితరులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): సౌమ్య థియేటర్ సమీపంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి మందిరంలో ఈ నెల 22వ తేదీ నుంచి దసరా మహోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ పేర్కొంది. 11 రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో తొలి రోజున శ్రీరజిత కవచాలంకృత వాసవీ కన్యకా పరమేశ్వరీదేవిగా, 23న బాలా త్రిపుర సుందరీదేవిగా, 24న గాయత్రిదేవిగా, 25న అన్నపూర్ణాదేవిగా, 26న శ్రీకాత్యాయనిదేవిగా, 27న లలితా త్రిపుర సుందరీదేవిగా, 28న మహాలక్ష్మీదేవిగా, 29న శ్రీసరస్వతి దేవిగా, 30న దుర్గాదేవిగా, 1న మహిషాసురమర్దినీదేవిగా, 2న శ్రీ రాజరాజేశ్వరిదేవిగా అమ్మవారిగా దర్శనమిస్తారన్నారు. 11రోజులపాటు ప్రతిరోజు సాయంత్రం 6గంటలకు ఆలయ ప్రాంగణంలో బతుకమ్మ పూజ జరుగుతుందని, విశేష అలంకారాలకు అనుగుణంగా ప్రత్యేక పూజలు, సంబరం, శమీపూజ, నగరోత్సవాన్ని నిర్వహిస్తామని చెప్పారు. భక్తులు విశేష సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు.

పోలేరమ్మ దేవస్థానంలో ఉత్సవాలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి పంచాయతీ పరిధిలోని ఊర్మిళా సుబ్బారావునగర్ గ్రామ దేవత పోలేరమ్మ దేవస్థానంలో ఈ నెల 22వ తేదీ నుంచి దసరా ఉత్సవాలు ప్రారంభమవుతాయని దేవస్థానం కమిటీ అధ్యక్షుడు సూరసాని రామిరెడ్డి తెలిపారు. దేవస్థానం ప్రాంగణంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించి వివరాలను వెల్లడించారు. ఈ దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఈ నెల 22 నుంచి వచ్చే 2వ తేదీ వరకు ప్రతి రోజు ఒక్కో అలంకారంలో అమ్మవారు దర్శనమిస్తారన్నారు. ఉత్సవాల్లో చివరి రోజు 2వ తేదీ తేదీ సాయంత్రం 6 గంటలకు అమ్మవారికి అఖండ హారతులు, రాత్రి 8 గంటలకు శమీ పూజ జరుగుతాయని చెప్పారు. అదే విధంగా దేవస్థానం ప్రాంగణంలో లక్ష్మీ సాయిబాబా దేవస్థానంలో 2వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు బాబావారి సమాధి ఉత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. 3వ తేదీ మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, సాయంత్రం లడ్డూ వేలం అనంతరం గ్రామ దేవత పోలేరమ్మ, శ్రీలక్ష్మీ సాయిబాబా ఊరేగింపు మహోత్సవం జరుగుతుందని చెప్పారు. కమిటీ కార్యదర్శి గుత్తావళి విజయబాబు, కోశాధికారి దొడ్డా వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి మాగం ఆత్మారాము పాల్గొన్నారు.

కుమారుడు కనపడటం లేదని తల్లి ఫిర్యాదు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): తన కుమారుడు కనపడటం లేదని తల్లి భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేసిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భవానీపురంలోని నివాసముంటున్న అడపా సుశీల తన భర్త, కుటుంబ సభ్యులతో కలిసి జీవిస్తుంది. కుమారుడు అడపా నిఖిల్‌సాయి(21) ఇటీవల డిగ్రీ పూర్తి చేసి కాంపిటేటివ్ పరీక్షల కోసం కోచింగ్ తీసుకుంటున్నాడు. వారి ఇంటికి దగ్గరలోనే 30 సంవత్సరాల వయస్సు కలిగిన యువతి నిఖిల్‌సాయి వెంటపడి ప్రేమిస్తున్నట్లుగా పేర్కొంది. ఎన్నిసార్లు మందలించినా వెంటపడటం మానలేదు. అలాగే కుమారుడి నుంచి తల్లిదండ్రులు ఫోన్ తీసుకున్నా ఆ యువతి కొత్త ఫోన్ కొనిచ్చింది. ఈ నెల తొమ్మిదో తేదీ నుంచి నిఖిల్‌సాయి కనపడటం లేదని, ఆ యువతి ఇంటికి సైతం తాళం వేసి ఉందని, ఆ యువతే తన కుమారుడిని తీసుకొని వెళ్లినట్లుగా అనుమానంగా ఉందని సుశీల తన ఫిర్యాదులో పేర్కొంది. దీనిపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'మరుపురాని మహనీయులు' గ్రంథావిష్కరణ

విజయవాడకల్చరల్: విఖ్యాత రచయిత, కాలమిస్ట్ నాగసూరి వేణుగోపాల్ రచించిన 'మరుపురాని మహనీయులు' గ్రంథావిష్కరణ పరిచయ సభ ఏలూరురోడ్డు సాయిమందిరం సమీపంలోని నాగాలాండ్‌లో ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న చినుకు మాసపత్రిక సంపాదకులు మహనీయులు జీవితాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. వేణుగోపాల్ రచించిన అనేక పుస్తకాలు పాఠకుల ఆదరణకు నోచుకున్నాయన్నారు. విశ్రాంత ఆకాశవాణి సంచాలకులు మంజులూరి కృష్ణకుమారి మాట్లాడుతూ వేణుగోపాల్ సాహిత్యజీవితాన్ని, ఆకాశవాణిలో ఆయన నిర్వహించిన ప్రయోగాత్మక కార్యక్రమాలను వివరించారు.

రూ.9 లక్షలతో సైడు కాలువలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం 44వ డివిజన్ పరిధిలోని న్యూ లేబర్‌కాలనీలో ఆరు బిల్డింగ్‌ల వద్ద నిర్మించనున్న సైడు కాలువల పనులను స్థానిక కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి ఆదివారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. మైలవరపు దుర్గారావు, బొడ్డుపల్లి శ్రీనివాసరావు, సత్యనారాయణ సింగ హరికృష్ణ, సాయిరెడ్డి పాల్గొన్నారు.

• దసరా ఏర్పాట్లు





కనకదుర్గమ్మ సన్నిధిలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇంద్రకీలాద్రిపై, కనకదుర్గా నగర్‌లో చలువ పందిళ్లు, క్యూ లైన్ల ఏర్పాటుతో పాటు విద్యుద్దీకరణ పనులు జరుగుతున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

అతిసార నియంత్రణలో ప్రభుత్వం విఫలం

వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మెహబూబ్ షేక్



లబ్బీపేట(విజయవాడతూర్పు): న్యూ రాజరాజేశ్వరీపేటలో ప్రబలిన అతిసార నియంత్రణలో కూటమి ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మెహబూబ్ షేక్ అన్నారు. ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడుతూ.. ఐదు రోజులుగా ఆ ప్రాంతంలో అతిసార కేసులు నమోదవుతున్నా, కారణం తెలుసుకుని అరికట్టలేక పోయారన్నారు. ఆ ఫలితంగా వందలాది మంది డయేరియా బారిన పడ్డారన్నారు. అధికారిక లెక్కల ప్రకారం 300 మంది ఉంటే, అనధికారికంగా ప్రైవేట్ ఆస్పత్రుల్లోలో చికిత్స పొందిన వారు మరింత ఎక్కువ మంది ఉన్నారని ఆయన తెలిపారు. అతిసారకు కారణాన్ని ఇంత వరకూ ప్రకటించలేక పోయారన్నారు. తొలుత వినాయక చవితి భోజనాలని, వంకాయ కూరంటూ మంత్రులు కట్టుకథలు చెప్పారన్నారు. కానీ ప్రభుత్వం సరఫరా చేసే మంచినీరు కలుషితం కావడం వలనే డయేరియా వ్యాప్తి చెందిందని ఆయన అభిప్రాయపడ్డారు. నీరు కలుషితం అయినప్పుడే వందల సంఖ్యలో డయేరియా కేసులు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రచార ఆర్భాటాలు మానీ, చిత్తశుద్ధితో డయేరియాను అరికట్టేందుకు కృషి చేయాలని హితవు పలికారు. ఆస్పత్రిల్లో చికిత్స పొందుతున్న వారికి నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆయన సూచించారు.

ముగిసిన కోటి కుంకుమార్చన మహా యజ్ఞం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంపీ కేశినేని చిన్ని, మురళీకృష్ణ, స్వామి అభిషేక్ బ్రహ్మచారిజీ

భవానీపురం(విజయవాడపశ్చిమ): జాతీయ ప్రగతి, ప్రపంచ శాంతి, పేదల సంక్షేమాన్ని ఆకాంక్షిస్తూ ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ గుంటుపల్లిలోని సీఏ కన్వెన్షన్ సెంటర్‌లో స్వామి అభిషేక్ బ్రహ్మచారిజీ మహరాజ్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించిన శ్రీ విద్యా దశ కోటి కుంకుమార్చన మహా యజ్ఞం ఆదివారంతో ముగిసింది. ఈ మహాయజ్ఞంలో 8 వేల మందికిపైగా మహిళలు పాల్గొని అత్యంత భక్తిశ్రద్ధలతో పది కోట్ల సార్లు శ్రీలలితా సహస్ర నామాన్ని జపిస్తూ సింధూరంతో అర్చన చేశారు. ఈ సందర్భంగా స్వామి అభిషేక్ బ్రహ్మచారిజీ మహరాజ్ అభిభాషణ చేస్తూ దేశ అభివృద్ధి మరింత వేగంగా జరగాలని, భారత్ విశ్వ గురువుగా ఎదగాలని మాతా లలితాదేవిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) మాట్లాడుతూ స్వామి అభిషేక్ బ్రహ్మచారి మహరాజ్ సనాతన ధర్మ పరిరక్షణ కోసం విశేష కృషి చేస్తుండటం అభినందనీయమన్నారు. యువచేతన జాతీయ కన్వీనర్ రోహిత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచ శక్తిగా ఎదుగుతోందని తెలిపారు. భక్తులకు అన్నప్రసాద వితరణ, మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్వర్ణ గ్రూప్ అధినేత ముత్తవరపు మురళీకృష్ణ, సీఏ కన్వెన్షన్ సెంటర్ అధినేత చిగురుపాటి నాగరాజు, నూతలపాటి బాల, ఎం.కృష్ణమోహన్, డాక్టర్ అనంతలక్ష్మి, తొండెపు రాధ, ఎస్.శారద, భాను, జొన్నలగడ్డ విజయలక్ష్మి, రాజ్‌మల్ జైన్, రోహిత్ చౌదరి పాల్గొన్నారు.

కొండ ప్రాంతాల్లో సమస్యల పరిష్కారానికి కృషి



స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న శంకరరెడ్డి

భవానీపురం(విజయవాడపశ్చిమ): కొండ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వైఎస్సార్ సీపీ 45వ డివిజన్ ఇన్‌చార్జి సరగడ శంకరరెడ్డి తెలిపారు. డివిజన్ పరిధిలోని కొండబడి ఎదురుగాగల కొండపై పర్యటించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీధి లైట్లు సరిగ్గా వెలగటం లేదని, కొత్త విద్యుత్ స్తంభాలు వేయాలని, పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా ఉందని, మెట్లు మరమ్మతులు చేయాలని తదితర సమస్యలను స్థానికులు ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా శంకర రెడ్డి మాట్లాడుతూ.. సమస్యలను పశ్చిమ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లి సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని వారికి చెప్పారు. గత ప్రభుత్వంలో ఏ సమస్య ఎదురైనా సత్వరమే పరిష్కరించేవారని, ఏడాది నుంచి తమ సమస్యలు, ఇబ్బందుల గురించి పట్టించుకున్న నాథుడు లేరని కొండ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. మూడు పార్టీల నాయకుల్లో ఎవరిని అడగాలో కూడా అర్థం కావటం లేదని, పార్టీ పేరు చెప్పి ఎవరికి వారు హల్‌చల్ చేయటం మినహా సమస్యల గురించి అడిగిన వారు లేరని ఆగ్రహం వ్యక్తం చేశారు. తొలుత ఆయన కొండ దిగువన వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బోర మల్లేశ్వరరెడ్డి, ఉండేల శ్రీనివాసరెడ్డి, సుంకర నారాయణ, ముత్తా వాసు, రవ్వ కోటేశ్వరి, సరగడ కృష్ణారెడ్డి, చల్లారావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై దాడులను నివారించడంలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి శ్రీదేవి

వించిపేట(విజయవాడపశ్చిమ): సమాజంలో రోజురోజుకు మహిళలపై అఘాయిత్యాలు, అత్యాచారాలు, హింసలు పెరిగిపోతున్నాయని, వాటిని నివారించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఐద్వా జిల్లా కార్యదర్శి కె.శ్రీదేవి ఆవేదన వ్యక్తం చేశారు. ఐద్వా పశ్చిమ నగర కమిటీ 14వ మహాసభ ఆదివారం కొత్తపేటలోని మోటూరి హనుమంతరావు శ్రామిక భవన్‌లో జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న శ్రీదేవి మాట్లాడుతూ నేటి సమాజంలో యువత మద్యం, ఆన్‌లైన్ బెట్టింగ్‌ల వ్యసనాలతో కుటుంబాలను వీధులపాలు చేస్తున్నారన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే వారి కుటుంబంతో పాటు సమాజం కూడా అభివృద్ధి సాధిస్తుందని, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఐద్వా నూతన కమిటీ ఎన్నిక..

నగరంలో కాలుష్యాన్ని నివారించి పరిశుభ్రమైన తాగునీరు అందించాలని, కొండ ప్రాంతంలో రిటైనింగ్ వాల్స్ నిర్మాణాలు, వితంతువులు, ఒంటరి మహిళ పెన్షన్‌లు ఇవ్వాలన్నారు. షేక్ రాజాసాహెబ్ హాస్పిటల్‌ను 100 పడకల జనరల్ హాస్పిటల్‌గా అభివృద్ధి చేయాలని, రేషన్ డిపోల్లో 14 రకాల నిత్యవసర సరుకులు పంపిణీ తదితర డిమాండ్‌లను ఈ మహాసభలో తీర్మానాలు చేశామని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న కేబీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ చదువుతోనే మహిళలు ఆర్థిక స్వావలంబన సాధిస్తారని, తద్వారా దేశాభివృద్ధికి ఎంతో దోహదపడుతుందన్నారు. అనంతరం ఐద్వా నూతన కమిటీని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా గాదే ఆదిలక్ష్మి, అధ్యక్ష, కార్యదర్శులుగా ఈ.విజయలక్ష్మి, కె.వెంకటరత్నం, సహాయ కార్యదర్శిగా కె.రమా, ఏకే వరలక్ష్మితో పాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

'ప్రైవేటీకరణ చేస్తే ప్రభుత్వానికి నూకలు చెల్లినట్లే'

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరంలోని ముసాఫిర్‌ఖానాను ప్రైవేటీకరణ చేస్తే కూటమి ప్రభుత్వానికి నూకలు చెల్లినట్లేనని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా నేత షేక్ హసన్ భాష(బాషి) అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం వించిపేటలోని తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ముసాఫిర్ ఖానాను ప్రైవేటుపరం చేసే ఆలోచనను కూటమి ప్రభుత్వం వెంటనే విరమించాలని, లీజు నోటీసును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. టీడీపీ నాయకుడు ఫతావుల్లాకు వైఎస్సార్ సీపీ నాయకులను విమర్శించే అర్హత లేదని ఘాటుగా ధ్వజమెత్తారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం ముసాఫిర్ ఖానాకు రూ.15 కోట్లు కేటాయిస్తే వాటిలో 10 కోట్ల రూపాయలు టీడీపీ నాయకులు స్వాహా చేసి కేవలం ఐదు కోట్లతో ముసాఫిర్ ఖానా కట్టి ఓపెన్ చేయలేదని విమర్శించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, నిధులు కేటాయించి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ముసాఫిర్ ఖానాను ప్రారంభింప చేశామని గుర్తు చేశారు. నాడు ముసాఫిర్ ఖానా మెయింటినెన్స్ కోసం పూల డెకరేషన్, సామాన్లకు టెండర్లు పిలిస్తే ఆ సాకు చూపించి నేటి కూటమి నాయకులు ముసాఫిర్ ఖానా బిల్డింగ్ మొత్తాన్ని ప్రైవేటుపరం చేయాలని, తద్వారా దోచుకోవాలని చూస్తున్నారని భాషి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేట్ వ్యక్తులకు లీజుకు ఇస్తే పేద ముస్లింలు తమ పిల్లల పెళ్లిళ్లు ఎలా చేసుకోవాలని ప్రశ్నించారు. ముసాఫిర్ ఖానా కమిటీ ద్వారా పేదలకు అతి తక్కువ ధరకే శుభకార్యాలకు అద్దెకిచ్చేలా చర్యలు తీసుకోవాలని బాషి కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.